ప్రజాశక్తి

బుధవారం 24 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అదాని సిమెంట్ ఫ్యాక్టరీతో ముప్పు



అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి కేటాయించిన స్థలమిదే..

- భయం గుప్పెట్లో ప్రజలు
- 10 లక్షల మంది ఆరోగ్యాలపై ప్రభావం
- ఆందోళన బాటలో గాజువాక నియోజకవర్గవాసులు

ప్రజాశక్తి - గాజువాక

పెదగంట్యాడలో అదాని గంగవరం గ్రైండింగ్ సిమెంట్ యూనిట్‌కు భూ కేటాయింపులు చేస్తూ, ఫ్యాక్టరీ ఏర్పాటుకు చకచకా ప్రయత్నాలు సాగుతుండటంపై గాజువాక నియోజకర్గ ప్రజలు భీతిల్లుతున్నారు. జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన ఇటువంటి పరిశ్రమను తమ ఇళ్ల చెంతనే ఏర్పాటు చేయడాన్ని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే అదాని గంగవరం పోర్టు కాలుష్యం, డంపింగ్ యార్డు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న జివిఎంసి 76వ వార్డు ప్రజలు ఈ సిమెంట్ ఫ్యాక్టరీపై భగ్గుమంటున్నారు. పెదగంట్యాడ మండలం సర్వే నెంబరు 97పి, 98, 99పి, 101పిలో సుమారు 20 ఎకరాల భూమిని అదానీ మెస్సర్స్ అంబుజా సిమెంట్స్ లిమిటెడ్‌కు గంగవరం సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడింది. అందుకు వచ్చేనెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన విడుదల చేసింది. సాగరతీరం, స్టీల్‌ప్లాంట్, జనావాసాలకు మధ్య ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల పెదగంట్యాడ, గాజువాక, గంగవరం, మల్కాపురం పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 10 లక్షల మంది ప్రజల ఆరోగ్యాలకు, జీవరాశులకు హాని జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ సిమెంట్ ఫ్యాక్టరీతో గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితం కానున్నాయని, శబ్ద కాలుష్యం పెరుగుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుతో అదనపు మిగతా 2లో..

ఈ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నాం



ఇప్పటికే రామచంద్రానగర్ డంపింగ్ యార్డుతో ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యాల పాలవుతున్నాం. దుర్వాసన పీల్చలేకపోతున్నాం. తాజాగా అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే ఇక అంతే సంగతులు. ఈ పరిశ్రమను మేం వ్యతిరేకిస్తున్నాం.

జి.లక్ష్మి,
స్వతంత్ర నగర్



ఈ గవర్నెన్స్ సదస్సులో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు

డిజిటల్ సాధికారత

ఇ - గవర్నెన్స్ జాతీయ సదస్సు ముగింపులో 'డిక్లరేషన్' వార్త మెయిన్‌లో..

నేటి నుంచి నర్సింగ్ విద్యార్థుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా ది ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టిఎన్ఎఐ) ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో నర్సింగ్ విద్యార్థుల ద్వైవార్షిక రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ - 2025ను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ మిడ్ వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్, టిఎన్ఎఐ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కె.సుశీల తెలిపారు. సోమవారం రామ్‌నగర్‌లోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో జర్నీ ఆఫ్ నర్సింగ్ స్టూడెంట్స్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సుకు ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ హాజరవుతారన్నారు. టిఎన్ఎఐ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్ శంషీర్ బేగం మాట్లాడుతూ వేలాది మంది నర్సింగ్ విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తామన్నారు.

హైడ్రో ఒప్పందాలు అల్లూరి స్ఫూర్తికి విరుద్ధం

వార్త 8లో..

కార్మికుల పని గంటల పెంపుపై నిరసనలు

వార్త 8లో..

తాచేరు కాజ్‌వే వద్ద విద్యార్థి గల్లంతు

వార్త 5లో..

పని ప్రదేశాల్లో మహిళల భద్రత కీలకం



మాట్లాడుతున్న డిఆర్ఎం లలిత్ బొహ్రా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు అన్ని సంస్థలు, పరిశ్రమలు కట్టుబడి ఉండాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ డిఆర్ఎం లలిత్‌బొహ్రా అన్నారు. మంగళవారం విశాఖపట్నంలోని పోర్ట్ సాగరమాల కన్వెన్షన్ సెంటర్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసిసిఐ) మహిళా విభాగం ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణ అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వటంలో రైల్వేలు ముందున్నాయన్నారు. ఆర్‌పిఎఫ్ మహిళా ఉద్యోగుల భద్రతలో భాగంగా వారికి బాడీ ఓన్ కెమెరాలు అందిస్తున్నామని, అన్ని పని ప్రదేశాల్లో లాకర్ రూమ్స్, చేంజింగ్ రూమ్స్, రెస్ట్‌రూమ్స్ వంటివి ఏర్పాట్లు చేస్తున్నామని, రన్నింగ్ రూమ్స్‌లో కూడా మహిళలకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పని ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపులు తీవ్రమైన నేరమని, అందుకు పాల్పడిన వారిపై కఠినచర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వాల్తేరు డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు జోత్స్న బొహ్రా, ఫిక్కి ఫ్లో ప్రతినిధి అంబ్రిలా అంజలివో, ప్రోగ్రాం సభ్యులు డాక్టర్ హేమ పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడులు హేయం

- తక్షణం ఆ పోలీసులను సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు డిమాండ్



పోలీసుల దాడి పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపిన విద్యార్థులపై భౌతిక దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో విద్యార్థులపై పోలీసులు చేసిన దాడికి సంబంధించిన ఫొటోలను, పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వాలని, స్కాలర్‌షిప్పులు పెంచాలని అడగటం తప్పా ? అని ప్రశ్నించారు. ఎయులో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా విన్నవించినప్పటికీ ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదన్నారు. అదే విషయాన్ని మరోసారి అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు విద్యార్థులు నిరసన తెలియజేశారని తెలిపారు. విద్యార్థులలో అమ్మాయిలు ఉన్నప్పటికీ వారిపైనా పోలీసులు దాడికి పూనుకున్నారన్నారు. బూటు కాళ్లతో తన్నారని తెలిపారు. ఇది ఎంత వరకూ భావ్యమని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని కోరితే అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులపై కర్కశత్వం ప్రదర్శించిన ఈస్ట్ ఎసిపిని, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ పోలీసుల చర్యలను ఖండించారు. సమస్యలు లేకుండా వ్యవస్థ నడిస్తే ఇటువంటి నిరసనలు చేయవలసిన అవసరం ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు తదితరులు మద్దతు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

అదాని సిమెంట్ ఫ్యాక్టరీతో ముప్పు

కాలుష్యం తప్ప ఈ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదంటున్నారు. కేవలం 60 మందికి పర్మినెంటు, 200 మందికి కాంట్రాక్టు ఉపాధి మాత్రమే లభిస్తుందని, అది కూడా స్థానికులకు ఇస్తారన్న గ్యారంటీ లేదని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. అదాని గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ఇప్పటికే గంగవరం, గాజువాక, మల్కాపురం ప్రాంతాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఇళ్ల లోపలకు రసాయనాలు, దుమ్ము, పొదరు వచ్చి చేరుతున్నాయని, మహిళలకు గర్భస్రావాలు అవుతున్నాయని చెబుతున్నారు. తాజాగా అదాని సిమెంటు పరిశ్రమ వస్తే ఈ ప్రాంత ప్రజల జీవితాలు మరింత దుర్భరమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ వస్తే 76వ వార్డులో నివాసం ఉంటున్న రిక్షా కాలనీ, రామచంద్రనగర్, స్వతంత్రనగర్, నడుపూరు హెచ్‌బి కాలనీల పరిస్థితి ఊహించుకుంటేనే భయమేస్తోంది. 71, 72, 73, 75, 65 వార్డుల్లోని ప్రజలది ఇదే పరిస్థితి. ఒడిశాలోని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఎత్తివేయాలని అక్కడ ప్రజలు ఆందోళనలు ఉధృతం చేస్తే దాన్ని తీసుకొచ్చి పెదగంట్యాడ పరిసర ప్రాంతాల్లో నెలకొల్పుతున్నారు. ఈ ఫ్యాక్టరీ ప్రారంభమైతే మండలం మొత్తం ఖాళీ చేయాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వారంతా పోరాటానికి సిద్ధమవుతున్నారు.

పోరాటానికి సిద్ధం



మరో పోరాటానికి ఈ ప్రాంత ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారు. రామచంద్రా నగర్ డంపింగ్ యార్డు, అదానీ గంగవరం పోర్టు కాలుష్యం చాలదన్నట్టు ఒడిశాలోని సిమెంట్ ఫ్యాక్టరీని తీసుకొచ్చి ఇక్కడి జనం నెత్తిన పెడుతున్నారు. ఇది దుర్మార్గం.

డి.రమణ, సిపిఎం నాయకులు

24, 25న ధర్నాలు

- దాడులు ఆపకుంటే పోరాటం తీవ్రం

- తోపుడుబండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం నాయకులు హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చిల్లర వర్తకులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జివిఎంసి అన్ని జోన్ల కార్యాలయాల ఎదుట ఈ నెల 24, 25 తేదీలలో ధర్నాలు నిర్వహించాలని తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం (సిఐటియు) నిర్ణయించింది. మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ నగర వ్యాప్తంగా అన్ని జోన్ల పరిధిలో తోపుడు బండ్లు, బడ్డీలను కనీసం నోటీసులు ఇవ్వకుండా తొలగిస్తూ వేల మంది చిల్లర వర్తకులను రోడ్డ పాలు చేయడం అన్యాయమన్నారు. తొలగించిన తోపుడు బండ్లు, బడ్డీలను అదే స్థలంలో కొనసాగించాలన్నారు. పగలగొట్టిన బండ్లకు, బడ్డీలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సుబ్బారావు మాట్లాడుతూ 2014 స్ట్రీట్ వెండార్స్ చట్టం ఉండగా తోపుడు బండ్లు, బడ్డీ కార్మికులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికే సర్వే చేసిన తోపుడు బండ్లు, చిల్లర వర్తకులకు వెంటనే వెండింగ్ కార్డులు ఇవ్వాలని, జోన్స్ ఏర్పాటు చేసి వీధి విక్రయదారులకు, తోపుడు బండ్లు, చిల్లర వర్తకులకు ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు మధురవాడ జోన్ నాయకులు పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జివిఎంసి కమిషనర్ చిల్లర వర్తకులపై చేస్తున్న దాడులకు ఆపరేషన్ లంగ్స్ 2.0 పేరు పెట్టి దారుణానికి ఒడిగట్టడం దుర్మార్గమన్నారు. దాడులు ఆపకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు పి.వెంకటరావు మాట్లాడుతూ జివిఎంసి పరిధిలోని అన్ని జోన్లలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖ తోపుడుబండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.మూర్తి, నాయకులు వరలక్ష్మి, నర్సింగరావు పాల్గొన్నారు.



చిరు వర్తకులకు మద్దతుగా ఆందోళన చేపట్టిన వైసిపి నేతలు

వైసిపి ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వీధి వ్యాపారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు విమర్శించారు. జివిఎంసి పరిధిలో దుకాణాలు, తోపుడు బండ్లను కూల్చివేస్తూ చిరువ్యాపారుల పొట్ట కొడుతున్న చర్యను ఖండిస్తూ మంగళవారం వైసిపి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలోకి వెళ్లే క్రమంలో పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తుదకు జివిఎంసి అదనపు కమిషనర్ రమణమూర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతిలో ఎంఎస్ఎంఇలు కీలకం

ఎపిలో రూ.4.48 లక్షల కోట్లతో ప్రాజెక్టులు

ఆ రంగం ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డిఎస్.రావత్



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎంఎస్ఎంఇ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ 2021-22 నుంచి 2024-25 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి, అభివృద్ధి అపరిమిత అవకాశాలపై చేసిన అధ్యయనంతో రూ.4.48 లక్షల కోట్ల పెట్టుబడి ప్రాజెక్టులను ఎపి ఆకర్షించబోతోందని ఎంఎస్ఎంఇ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డిఎస్ రావత్ మంగళవారం వెల్లడించారు. పారిశ్రామిక ప్రగతిలో ఎంఎస్ఎంఇలు ఎంతో కీలకమన్నారు. విశాఖలోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు రెండింటిలోనూ పెట్టుబడి ప్రాజెక్టులు పూర్వవనున్నాయన్నారు. 2024-25 సంవత్సరంలో రూ.19,685 కోట్ల విలువైన పెట్టుబడి ప్రాజెక్టులు పూర్తయి, రూ.8910 కోట్ల విలువైన ప్రాజెక్టులు పునరుద్ధరించబడ్డాయన్నారు. అలాగే 2023-24లో రాష్ట్రం రూ.1,20,858 కోట్ల విలువైన కొత్త ప్రాజెక్టులను ఆకర్షించిందన్నారు. వీటిలో రూ.65 వేల కోట్ల ప్రాజెక్టులను పూర్తిచేసిందన్నారు. పారిశ్రామిక కారిడార్లపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు.

ఐటి ఎగుమతులను ప్రోత్సహి స్తోందన్నారు. పోర్టు ఆధారిత అభివృద్ధికి గమ్యస్థానంగా ఎపిని ఉంచేందుకు ఎంఎస్ఎంఇలు దోహదపడనున్నాయన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్, టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఫార్మాసూటికల్స్, ఐటి, ఆధారిత సేవలు, పర్యాటకం, ఆక్వా కల్చర్, ఇంధనం వంటి విభిన్న రంగాల్లో పనిచేస్తున్న 2.5 మిలియన్లకుపైగా ఎంఎస్ఎంఇలు పారిశ్రామిక ప్రగతికి కీలకంగా ఉన్నాయన్నారు.

పోర్టు చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా రామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



రామ్‌ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

విశాఖ పోర్టులోని సీనియర్ అధికారి సిహెచ్.రామ్‌ప్రసాద్‌కు పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (సిఎంఇ-హెచ్‌ఒడి)గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 1998లో గోవా పోర్టులో జూనియర్ ఇంజినీర్‌గా చేరిన రామ్‌ప్రసాద్ అంచెలంచెలుగా చీఫ్ ఇంజినీర్ స్థాయికి ఎదిగారు. పోర్టులో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (పిఎంయు)లోని మెటీరియల్ మేనేజర్ విభాగానికి డిప్యూటీ హెచ్‌ఒడిగానూ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)కి డైరెక్టర్‌గానూ విధులు నిర్వహించారు. ఈ నెల 22న కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నుంచి సిఎంఇగా ఆయన్ని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పోర్టులో బెర్తుల ఆధునీకరణ, అప్‌గ్రేడేషన్, అలాగే పిపిపి ఆపరేషన్స్‌లో రామ్‌ప్రసాద్ కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఈ విభాగాలన్నిటినీ ఒకే గొడుగు కింద నిర్వహించే సిఎంఇకి హెచ్‌ఒడిగా నియమితులయ్యారు.

రూ.1.21 కోట్ల సొత్తు రికవరీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో 2025 ఆగస్టు నెల రికవరీ మేళాను మంగళవారం నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ 2025 ఆగస్టులో 105 కేసులు నమోదయ్యా యని అందులో 75 కేసులను విజయవంతంగా ఛేదించామని 103 మందిని అరెస్టు చేశామన్నారు. చోరీ అయిన సొత్తులో రూ.64,24,953 విలువ గల వస్తువులతో పాటు రూ.57,00,000 విలువ గల 380 మొబైల్ ఫోన్లను కలుపుకుని మొత్తం రూ. 1,21,24,953 విలువగల సొత్తును రికవరీ చేయడం జరిగిందని రికవరీ చేసిన వస్తువులను ఈ మేళా ద్వారా బాధితులకు అందజేయం జరుగుతుందన్నారు. ఆగస్టులో రికవరీ చేసిన సొత్తులో 557.395 గ్రాముల బంగారం, రూ.5,70,500నగదు, 18 ద్విచక్ర వాహనాలు, 423 మొబైల్ ఫోన్‌లు తదితరాలు ఉన్నాయన్నారు.

హైర్ బస్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: హైర్ బస్ డ్రైవర్ల జీతాలు పెంచాలని,పిఎఫ్,ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం వద్ద ఎపిఎస్ఆర్టీసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి, ఎపిఎస్ఆర్టీసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వాల్తేర్ డిపో గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ వాల్తేరు, మద్దిలపాలెం, సింహాచలం ఆర్టీసీ డిపోల్లో అద్దెబస్ డ్రైవర్లకు వేతనాలు అద్దె బస్సు ఓనర్లు పెంచాలని డిమాండ్ చేశారు. గతంలో ఒప్పంద కాలం పూర్తి అయి 11 నెలలు కావస్తున్నా, వేతనాలు పెంచక పోవడం అన్యాయమని విమర్శించారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో బస్సుపాస్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదాలు జరిగితే బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బి.జంపన్న, రఘు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో (జూనియర్ డివిజన్)
E.P. 80/2022 O.S. 94/2020

మధ్యన:
గండేపల్లి లక్ష్మణరావు...పిటిషనర్/డిక్రీహోల్డర్
And
బొర్రా సత్తిబాబు...రెస్పాండెంట్/జడ్జిమెంట్ డేటర్

బహిరంగ వేలం ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యులు స్థిరాస్తి ఇందలి జడ్జిమెంట్ డేటర్‌కు చెందినదయి. నా క్లయింటు ఈ.పి.80/2022; O.S.94/2020 దావా ను పై కోర్టులో డిక్రీ పొంది ఈ.పి 80/2022 దాఖలు చేసి సదరు షెడ్యులు ఆస్తిని వేలం వేయుట ద్వారా విక్రయించ బడునని పై ఉత్తర్వుల ప్రకారం తే.7-10-2025 తే దిన షెడ్యులు ఆస్తిని వేలం వేయబడును. కావున ఆసక్తి కల పాట దారులు ఉ.10-00 లకు హాజరయి షెడ్యులు ఆస్తిని వేలం పాడుకోవలసినదిగా తెలియచేయడమైనది.

షెడ్యులు

విశాఖపట్నం జిల్లా ప్రస్తుతం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ (డి) కోట ఉరట్ల మండలం, బోడపాలెం పంచాయతి శివారు కొత్తూరు గ్రామం తాలుకు దోర్ నెం.102/1 లో య.0-2.1/2 సెంట్లు కల నాలుగు గదులు గల పెంకుటి ఇల్లుకు **హద్దులు :**
తూర్పు : పంచాయతీ రోడ్
దక్షిణం : సింగంపల్లి నూకరాజు దాబా ఇల్లు
పడమర : సింగంపల్లి చంటమ్మ ఖాళీ స్థలం
ఉత్తరం : సింగంపల్లి చంటమ్మ పెంకుటి ఇల్లు

నర్సీపట్నం — డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్
తే.21-9-2025

SUIT SUMMONS
IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT SRUNGAVARAPUKOTA
OS 159/24

Between:
ఎన్నింటి సన్యాసమ్మ ....Plaintiffs
And:
కంటుభుక్త అప్పలనాయుడు and 2 Ohers ....Defendants

To.
2nd Defendant : బేరి సురేష్, S/o గురునాధం, R/o Dr No. 8-16-39, నాగవంశపువీధి, అనకాపల్లి మండలం & జిల్లా.
3rd Defendant : బేరి వెంకటలక్ష్మి, W/o సురేష్, R/o Dr No. 8-16-39, నాగవంశపువీధి, అనకాపల్లి మండలం & జిల్లా..

NOTICE

Please take this notice that the above matter is posted to 13-10-2025 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **13-10-2025 at 10.30 A.M.**, either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence. By Court Order

B.Satyanrayana,
Advocate, S.Kota,
Cell: 9849168309

మహారాజశ్రీ పార్వతీపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టువారి దివ్య సముఖమునకు
O.S. 155/2021

Between:
ఒమ్మి తిరుపతిరావు ....వాది
మరియు :
ఒమ్మి ఆచారి వగైరాలు ....ప్రతివాద్లు

To,
5వ ప్రతివాది :- గాదె జానకి, W/o మోహన్‌దాస్, Dr.No. 23-19-1/2, శ్రీ సాయి జయ వెంకట రెసిడెన్సీ, సింహాచలం, విశాఖపట్నం రూరల్, విశాఖపట్నం జిల్లా - ....ప్రతివాది నెం.5

పై నెంబరు దావాలోని దావా షెడ్యులు ఆస్తిని పంపకము చేయమని వాది దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా **తే 9-10-2025ది** నాటికి వాయిదా ఉన్నది. ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా సదరు వాయిదా దినం నాడు పై కోర్టులో మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని **ఉదయం 10-30 గం॥లకు** హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

// పై కోర్టువారి ఆర్డర్ ప్రకారం//

సత్యవరపు శ్రీనివాసరావు
న్యాయవాది, సాలూరు

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT JUDGE
AT : VISAKHAPATNAM
IA 97/2019 AS 19/2020

Between:
Gorle Gidionu @ Ramu Naidu and another
...Appelleants/Defendents
And
Karra John
...Respondent/Plaintiff

NOTICE

To,
Karra John
S/o Nageswara Rao, Christian, Age 30, D.No.5-5-6, Kamakshi Nagar, Kancharapalem, Visakhaapatnam.

Please take notice that the above named appallents/ defendants has instituted the above IA against you and the same stands pased to **7-10-2025 at 10.30am** for your apperence on that days your personally or through Adocate attend before the Hon'ble Court **at 10.30 a.m** failing which the matter will be heard and determined in your absence basing on the meterial avialable in the court

(By Order of the Hon'ble Court)
M.V.RAJESH
Advocate, Visakhapatnam-03
Cell: 9849251636
Dt.18-9-2025

IN THE HON'BLE COURT OF THE II ADDL. DISTRICT JUDGE
AT : VISAKHAPATNAM
AS 19/2020

Between:
Gorle Gidionu @ Ramu Naidu and another
...Appelleants/Defendents
And
Karra John
...Respondent/Plaintiff

NOTICE

To,
Karra John
S/o Nageswara Rao, Christian, Age 30, D.No.5-5-6, Kamakshi Nagar, Kancharapalem, Visakhaapatnam.

Please take notice that the above named appallents/ defendants has instituted the above AS against you and the same stands pased to **7-10-2025 at 10.30am** for your apperence on that days your personally or through Adocate attend before the Hon'ble Court **at 10.30 a.m** failing which the matter will be heard and determined in your absence basing on the meterial avialable in the court

(By Order of the Hon'ble Court)
M.V.RAJESH
Advocate, Visakhapatnam-03
Cell: 9849251636
Dt.18-9-2025

ఎయు చారిత్రక వికాసాన్ని గ్రంథస్తం చేయాలి

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి వి.శ్రీనివాస్



కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎయు విసి జిపి.రాజశేఖర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : శతాబ్ద చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయ చారిత్రక వికాసాన్ని గ్రంథస్తం చేయాలని కేంద్ర ప్రభుత్వ అడ్మినిస్ట్రేటివ్ పబ్లిక్ గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి వి.శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఎయు ఆచార్యులను ఉద్దేశించి మంగళవారం ఆయన ప్రసంగించారు. విశ్వవిద్యాలయాన్ని రానున్న 50 సంవత్సరాలలో ఏ విధంగా అభివృద్ధి చేయాలి, ఏ దిశగా నడిపించాలి అనే అంశాలపై ఒక విజన్‌ను కలిగి ఉండాలని సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఎంతో ఆకర్షణీయంగా, ఇంటర్ యాక్టివ్‌గా ఉండాలని చెప్పారు. ఎందరో నాయకులను అందించిన ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయం ఎయు అని చెప్పారు. ఆచార్యులు నిరంతరం పరిశోధనలు జరపడం, పరిశోధనా పత్రాలను జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించడం తమ విధిగా కలిగి ఉండాలన్నారు. తాను దేశవ్యాప్తంగా వివిధ సంస్థలలో పనిచేసిన సందర్భాలు, అక్కడ అనుభవాలను పంచుకున్నారు. పరిశోధనలో, పరిశోధనా పత్రాలపరంగా పటిష్టంగా ఉంటే విశ్వవిద్యాలయానికి ఎనలేని గుర్తింపు లభిస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ఒక ప్రత్యేకమైన స్టడీ గ్రూపులను కలిగి ఉండాలని సూచించారు. ఈ స్టడీ గ్రూపులు విభిన్న అంశాలను అధ్యయనం చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న క్వాంటం కంప్యూటర్ పైన, రాష్ట్రంలో ఆదివాసీ ప్రాంతం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆదివాసులకు సంబంధించిన అంశాలపైన ఈ గ్రూపులు అధ్యయనం చేయాలని సూచించారు. శతాబ్ది వేడుకలు జరుపుకుంటున్న ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తాను రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అరకులో తాను గడిపిన చిన్ననాటి రోజులను, విశాఖ నగరంలో తాను చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తన తల్లిదండ్రులు ఇద్దరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకున్నారని తెలిపారు. ఎయు ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ గవర్నెన్స్ సదస్సు నిమిత్తం విశాఖ వచ్చిన వి.శ్రీనివాస్‌ను విశ్వవిద్యాలయానికి ఆహ్వానించామని, సదస్సులో కీలకంగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ఆంధ్ర విశ్వవిద్యాలయంపై ఉన్న అభిమానం, అనుబంధంతో ఆయన రావడం, విశ్వవిద్యాలయ ఆచార్యులను ఉద్దేశించి ప్రసంగించడం సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం తరపున సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఎయు రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, కె.సీతామాణిక్యం, జి.గిరిజాశంకర్, పద్మశ్రీ, జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఎస్ రాయవరం : మండలంలో గోకులపాడు సమీపంలో వ్యాను ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. తుని నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న ఐసర్ వ్యాన్, బైక్ ఢీకొన్న ఘటనలో పోమిరెడ్డి నాగేశ్వరరావు అనే వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు, క్షతగాత్రుడిని నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి, మృత్యువాత పడ్డాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్మీనగర్‌లో కార్డెన్ సెర్చ్

- 17 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం ప్రాంతం లక్ష్మీనగర్‌లో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద ప్రదేశాలను తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలు బయటపడ్డాయి. రెండు చోట్ల 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదు చేశారు. మద్యం అక్రమంగా నిల్వ చేసి అమ్మకానికి ప్రయత్నిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మద్యం నిల్వ, రవాణా, విక్రయాలలో ఎవరూ పాల్గొనవద్దని, అలా చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టంచేశారు.


మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తిశాంత్

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు చిట్టివలస, సంతపేటకు చెందిన చెట్ల తిశాంత్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు అండర్ 19 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు జరుగనున్నాయి. విద్యార్థి తిశాంత్ భీమిలి మండలం తాళ్లవలసలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఎంపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 2024 నవంబర్‌లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన అండర్ 19 విభాగంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ (పరుగు) పోటీల్లో పాల్గొని రెండో స్థానంలో నిలిచాడు.



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస బొగ్గురోడ్డులోని శ్రీ కృష్ణ జూనియర్ కళాశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు జరజాపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంచుకున్న లక్ష్యం ఉన్నతంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మానసిక ఒత్తిళ్లకు ప్రభావితం గాకుండా, ఎటువంటి సమస్యనైనా సరే ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ బి.నరసింగరావు, ప్రిన్సిపల్ సూర్యనారాయణ, గురుమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సురేష్

ఎన్ఎస్ఆర్ఐటి అధ్యాపకులకు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని సొంట్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్)కు చెందిన ఇద్దరు అధ్యాపకులు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపెటెన్సీస్ (సిఎస్‌సి ఇండియా) అవార్డులు అందుకున్నారు. ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి.శివప్రసాద్, ఐఐఇ మెంటార్ డాక్టర్ ఎన్ఇ.నవీన్‌కు జాతీయ స్థాయి అవార్డులను అందించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, ప్రతిభ అభివృద్ధికి కృషి చేసినందుకు ఈ అవార్డులు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జెఎన్‌టియు-జివి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు. అవార్డులు అందుకున్న అధ్యాపకులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.



అవార్డులు అందుకుంటున్న అధ్యాపకులు

బీమా పథకాలపై అవగాహన



బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి- పద్మనాభం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై మండలంలోని పెంట గ్రామంలో ఎస్‌బిఐ అనంతవరం బ్రాంచి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ఆర్‌కె.మోహన్ హాజరై గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నామినీ, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. జన్ ధన్ ఖాతాల నవీకరణ చర్యలు, గ్రామీణ ప్రాంతాలలో క్షేత్రస్థాయికి ఎస్‌బిఐ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ ఎజిఎం రాధాకృష్ణమూర్తి, లీడ్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్, సిఎంఎఫ్ఐ వేణుగోపాల్, ఎఫ్ఐ మేనేజర్ రాఘవేంద్ర, అనంతవరం శాఖ మేనేజర్ బెన్ యోనా, గ్రామ సర్పంచ్ బి.పావని పాల్గొన్నారు. మండలంలోని పాండ్రంగి గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి గ్రామ మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు.

కాపులుప్పాడలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి కాపులుప్పాడలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, ఎఒ బి.శివకోమలి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి విజయప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పొలాల్లో ఆకుముడత తెగులు ఎక్కువగా ఆశించినట్లు తెలిపారు. వరి పంట పిలక దశలో ఉన్నందున ఆకుముడత తెగులు నివారణకు ఎకరానికి క్లోరిఫైరిపాస్ 400 మిల్లీ లీటర్లు మందును 300, 400 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఆకు ముడత తెగులు చిరు పొట్ట దశలో సోకితే ఎకరానికి 400 గ్రాముల కార్టాప్ హైడ్రో క్లోరైడ్ లేదా ఎసెఫేట్ 400, 500 గ్రాములు మందును 300, 400 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. జింక్ లోపం పొలాల్లో ఎక్కువగా ఉన్నందున చిలేటెడ్ జింక్‌ను నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.


కాపులుప్పాడలో వరి పంట పొలాలను పరిశీలిస్తున్న ఎ డి విజయ ప్రసాద్, ఎఒ శివకోమలి

ఘనంగా బెహరా జన్మదిన వేడుకలు


బెహరా భాస్కరరావు జన్మదిన వేడుకలు జరుపుతున్న నాయకులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు జన్మదిన వేడుకలను ఆయన స్వగృహంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బెహరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ రవితేజ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అడవివరం ది కో-ఆపరేటివ్ బ్యాంకు క్రెడిట్ సొసైటీ డైరెక్టర్లు, జనసేన నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ మాట్లాడుతూ, బెహరా భాస్కరరావు స్థానికంగా లేకున్నా జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. బెహరా భాస్కరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని బెహరా అభిమానులు బెహరా సత్యనారాయణ, గొడ్డ నాగరాజు, బలిరెడ్డి శ్రీను, ఇవి.రమణ, షేక్ వల్లి ఆధ్వర్యంలో బెహరా హాస్పిటల్‌లో, శ్రీనివాసనగర్‌లోని శ్రీ బంగారుతల్లి వృద్ధాశ్రమంలో పండ్లు, డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధవళ గోపాల్, కంపర కోటేశ్వరరావు, బురెడ్డి గోపి, పొట్నూరి శంకరరావు, బల్లంకి వెంకట్రావు, గొంతిన నాగరాజు, దేరెడ్ల సత్యనారాయణరెడ్డి, ఊటపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విక్రాంత్ బటెజా వీర్ బహదూర్ సింగ్

కేన్సర్ నిర్ధారణలో ఎఐ కీలక పాత్ర

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 'ఇంటిలిజెంట్ కేన్సర్ ఇమేజింగ్ బేసిడ్ డయాగ్నైజేషన్ సిస్టం'పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఇఇఇ సీనియర్ మెంబర్ డాక్టర్ విక్రాంత్ బటెజా వీర్ బహుదూర్ సింగ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో కేన్సర్ నిర్ధారణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్ ప్రెటబుల్ మెడల్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వైద్యరంగంలో ఆధునిక టెక్నాలజీని అందించడం ద్వారా రోగులకు సారమైన చికిత్సలు అందించగలుగుతామన్నారు. రెక్టార్ డాక్టర్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ, ఆరోగ్య రంగం, ఇంజినీరింగ్ కలిసినప్పుడు సమాజానికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు కొత్త దిశలను చూపిస్తాయని అభిప్రాయపడ్డారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎపి సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యాన 2025 - 26 విద్యా సంవత్సరానికి ఎస్ఎస్‌సి, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు అక్టోబర్ 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎపిఒఎస్ఎస్ డైరెక్టర్ ఆర్ నరసింహారావు ఆదేశాల జారీ చేసినట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పొన్నగంటి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్ణీత సమయంలో చెల్లించకుంటే రూ.200 అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



నృత్య ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

అలరించిన సాంస్కృతికోత్సవం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవం రెండవ రోజైన మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించింది. శాస్త్రీయ, జానపద నృత్యాలు, బృంద నాట్యం, సోలో సింగింగ్, గ్రూప్ సింగింగ్, నాటికల విభాగాలలో జాతీయ సేవా పథక కార్యకర్తలు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి, ఆహూతులను అలరించారు. 30 ఆంధ్ర విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు, క్యాంపస్ కళాశాలల నుండి దాదాపు 650 మంది వివిధ అంశాలలో పోటీపడి సత్తాను చాటారు. 150 మందికి పైగా వాలంటీర్లు బృంద నాట్యాలలో పాల్గొన్నారు. ముఖ్యంగా థింసా నృత్యం, కోయదొరల విన్యాసం, కోలాటం, జాతర తదితర జానపద నృత్యాలు ఎంతగానో అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా బుధవారం వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ అందిస్తారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.సింహాచలం తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులుగా జోనల్ ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ ఇపిఎస్.భాగ్యలక్ష్మి, ఇతర సీనియర్ ప్రోగ్రాం అధికారులు వ్యవహరించారు.

70 మందికి టిబి స్క్రీనింగ్

ప్రజాశక్తి- మధురవాడ : పిఎం.పాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 70 మందికి టిబి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా క్షయ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ రమేష్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షలు వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజనే, టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి-యంత్రాంగం

పెందుర్తి : నాయుడుతోట నుంచి చినముసిడివాడ వరకు ఉన్న దుకాణాలను తొలగించారు. సుమారు 20 మంది సిబ్బంది, రెండు జెసిబిలు, రెండు లారీలు, ప్రైవేట్ సిబ్బందితో వచ్చి ఫుట్‌పాత్‌కు ఇరువైపులా ఉన్న 20 షాపులను తొలగించారు. ఉన్న ఫలంగా తొలగించడంపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే విహార యాత్రలో ఉన్నామని చెప్పి స్విచ్ ఆఫ్ చేశారని మండిపడండారు. ఎన్నో ఏళ్ళుగా వ్యాపారాలు చేసుకుంటున్నామని, బడ్డీలను ఉన్న ఫళంగా తొలగించడం వల్ల కలిగే నష్టాన్ని ఎవరు భరిస్తారని చిరువ్యాపారులు నిలదీశారు.

వేపగుంట : నాయుడుతోట నుండి బంటా కాలనీ వైపు వెళ్లే రహదారిలో బడ్డీలు, తోపుడుబండ్లను తొలగించారు. చిరు వ్యాపారులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో నాయుడుతోట వద్ద కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పెద్దపెద్ద భవనాలను అక్రమంగా కట్టినా అటువైపు చూడరు కానీ.. తమపై ప్రతాపం చూపుతున్నారని ఎసిపి రామలింగారెడ్డిని చిరు వ్యాపారులు నిలదీశారు. కనీసం నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు.

జీవనోపాధిని కోల్పోయాం

మా అమ్మమ్మ, తర్వాత మా అమ్మ, ఇప్పుడు నేను సుమారు 56 సంవత్సరాల నుండి ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్నాం. ఫుట్‌పాత్‌కు దూరంగా షాపు ఉంది. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా వచ్చి షాపును చిందరవందర చేశారు. లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. జీవనోపాధిని కూడా కోల్పోయాం.

ఎమ్.సంతోషి
కొబ్బరిబొండం వ్యాపారి

అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న జివిఎంసి బాధితుల ఆక్రందనలు



నేడు జగన్నాథరావు ఉద్యోగ విరమణ



సనపల జగన్నాథరావు దంపతులు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ ఉద్యోగి సనపల జగన్నాథరావు బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వే స్టేషన్ సమీపంలోని నీలాపురం గ్రామంలో సనపల పాపయ్య, సనపల సంతోషమ్మ దంపతులకు రెండవ సంతానంగా జగన్నాథరావు జన్మించారు. కాశీబుగ్గలో 10వ తరగతి వరకు, నౌపాడాలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. తరువాత పలాసలో ఐటిఐ చేశారు. 1987లో బిహెచ్‌పివిలో అప్రెంటిస్ షిప్ చేశారు. తరువాత స్టీల్‌ప్లాంటు, షిప్‌యార్డు, ఆటోనగర్‌లోని సిలిండర్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేశారు. 1992లో బిహెచ్‌పివిలో క్యాజువల్ ఉద్యోగిగా 15 సంవత్సరాలకుపైగా పనిచేసిన తర్వాత పర్మినెంట్ అయ్యారు. బిహెచ్‌పివిలో ఉద్యోగంలో చేరినప్పటి నుండి సిఐటియు విధానాలకు ఆకర్షితులై 1993 సంవత్సరంలో సభ్యునిగా చేరారు. తరువాత వామపక్ష అభ్యుదయ భావాలకు ఆకర్షితులై 1996 మే 19వ తేదీన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సిపిఎం సభ్యునిగా చేరారు. పార్టీ సభ్యునిగా కొనసాగుతూనే ఉన్నారు. బిహెచ్‌పివి ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో, సిఐటియు, సిపిఎం, పిలుపుమేరకు అన్ని ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిహెచ్‌పివి టౌన్ షిప్ డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కంపెనీ రక్షణ కోసం జరిగే పోరాటంలో జగన్నాథరావు రెండుసార్లు అరెస్టయ్యారు. సిఐటియు జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా, గాజువాక జోన్ కమిటీ ఆఫీస్ బేరర్‌గా పనిచేశారు. భెల్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిచి ప్రచార కార్యదర్శిగా, ప్లాంట్ కౌన్సిల్ మెంబర్‌గా పనిచేసి కార్మిక సమస్యలపై గళం విప్పారు. విశాఖ పారిశ్రామిక ప్రాంతంలో వివిధ కంపెనీల సమస్యలపై అక్కడ జరుగు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్ని జాతీయ సమ్మెల్లో పాల్గొన్నారు. కంపెనీ రక్షణ కోసం, ప్రజా సమస్యలపై జరిగే పోరాటాల్లో ఆయనతోపాటు భార్య నాగవేణి కూడా పాల్గొనేవారు.



కుట్టు శిక్షణ ముగింపులో ప్రతినిధులు

ఉచిత కుట్టు శిక్షణ పూర్తి

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 62వ వార్డులో 100 రోజుల ఉచిత కుట్టు శిక్షణ తరగతుల మొదటి బ్యాచ్ పూర్తయింది. ఉచిత కుట్టు శిక్షణ కో-ఆర్డినేటర్‌గా బాలకృష్ణ, ట్రైనర్లు పార్వతి, కుసుమ సారధ్యంలో శిక్షణా తరగతులు దిగ్విజయంగా పూర్తయ్యాయి. సెంటర్ ఏర్పాటుకు సహకరించిన వార్డు తెలుగుదేశం అధ్యక్షులు మజ్జి మాలినాయుడును, కో-ఆర్డినేటర్ బాలకృష్ణను, కుట్టు శిక్షణ అందించిన పార్వతి, కుసుమను మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గంగాధర్, చందు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దసరా ఉత్సవాలు



రాధను సన్మానిస్తున్న మహిళా ప్రతినిధులు

ప్రజాశక్తి -యంత్రాంగం

మాధవధార : మురళీనగర్‌లోని వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో ఉన్న వేములపల్లి కళాక్షేత్రంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సహకారంతో దసరా మహిళా సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నృత్య కళాకారులు సుమారు 50 మంది టీములతో రెండు రోజుల పాటు ప్రదర్శనలిచ్చారు. మురళీనగర్, మాధవధార, మర్రిపాలెం, కంచరపాలెం ప్రాంతాల నుండి ప్రజలు పాల్గొన్నారు. ఈ నృత్య ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ప్రథమ మహిళ రాధ మాట్లాడుతూ, మహిళలందరినీ ఒకే చోటుకు తీసుకొచ్చి ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. నేటి యువతకు తెలుగు పండుగల గురించి తెలియడం లేదని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పండుగల ఆవశ్యకత తెలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా టీం లీడర్లకు నృత్య కళాకారులకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ ఎ.నిర్మల, సుజాత, లలితారెడ్డి, బిహెచ్.సావిత్రి, పి.శైలజ, పిలక్ష్మికుమారి, బేబీ, వైశాఖి స్పోర్ట్స్ పార్కు కార్యదర్శి రాజు, ఎం.సౌజన్య, వేణు, హరిత, ఉషారాణి, సుభాషిని, దసరా మహిళా సంస్కృతి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలను ఘనంగా సత్కరించారు.

బివిఎన్‌లో దసరా ఉత్సవాలు

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్లో దసరా ఉత్సవాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు దసరా పండుగ విశిష్టతను వివరించారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి సూచికగా ఈ పండుగను నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థినులు అమ్మవారి వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది సునీత, శిరీష, శైలజ, హేమలత పాల్గొన్నారు.



గాజువాక భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్లో

నేటి చలో విశాఖ డెయిరీని జయప్రదం చేయాలి

- ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు
- గ్రామాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పాల రైతుల సమస్యలపై బుధవారం తలపెట్టిన చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి పాల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మడుతూరు, చీమలపల్లి, భోగాపురం, అప్పన్నపాలెం, కొండకర్ల తదితర గ్రామాలలో పాల రైతుల్లో ప్రచారం నిర్వహించారు. పాల రైతులు నష్టపోతున్న వివరాలను తెలియజేసే కరపత్రాలను, గోడ పత్రికలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ పాల రైతుల కృషి వలన విశాఖ డెయిరీ ఇప్పటి వరకు అభివృద్ధి పథంలో నడిచిందని, వందల కోట్ల రూపాయలను డెయిరీ ఆర్జించిందని చెప్పారు. డెయరీ పాలకవర్గం అవినీతి కారణంగా నేడు రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కే సోము నాయుడు, రమణ, శ్రీను, వరబాబు, గిరి, సంజీవ్, రైతులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

కె.కోటపాడు : చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని వారాడ, కోడూరు, రామయోగి అగ్రహారం, గవరపాలెం, పిండ్రంగి, పోతనవలస, వి.సంతపాలెం గ్రామాల్లో ఏపి రైతు సంఘం నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి జి.నాయనబాబు, నాయకులు వి.సూర్యనారాయణ, రొంగలి ముత్యాలనాయుడు మాట్లాడుతూ విశాఖ డెయిరీ అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పాల ధర లీటర్ రూ.10 పెంచాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి బోనస్ ప్రకటించాలని, 75 శాతం సబ్సిడీతో దాణా ఇవ్వాలని డిమాండ్ చేశారు.


హైవే నిర్మాణ పురోగతిని తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

విశాఖ-రాయపూర్ హైవే పనుల పరిశీలన

ప్రజాశక్తి- సబ్బవరం : విశాఖ-రాయపూర్ హైవే నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఆలిండియా నేషనల్ హైవే చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ మంగళవారం పరిశీలించారు. నేషనల్ హైవే సిబ్బందితో పనుల తీరుపై చర్చించి, పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్‌డిఓ షేక్ అయేషా, ఎన్‌హెచ్-16 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానవేణి, తహశీల్దార్ బి.చిన్నికృష్ణ, నేషనల్ హైవే బోర్డు మెంబర్లు, రీజనల్ ఆఫీసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్ కుమార్ పాల్గొన్నారు.

శతశాతం ఫలితాలు సాధించేలా బోధన

ప్రజాశక్తి-కె.కోటపాడు : విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా బోధన ఉండాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డిఐఇఒ) మద్దిలి వినోద్ బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అయ్యన్న జూనియర్ కాలేజీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటి, నీట్, ఎంసెట్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ఉత్తమ బోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. ప్రభుత్వ కాలేజీలకు ఇచ్చిన కాంపిటేటివ్ మెటీరియల్‌ను విద్యార్థులకు అందచేసి విధిగా వారాంతపు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట అయ్యన్న జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నూర్జహాన్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగమణి ఉన్నారు.

పరిశ్రమల కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : దసరా, దీపావళి పండగల సందర్భంగా ఎస్‌ఈజెడ్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు 20 శాతం బోనస్‌ను అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.రాము, మండల కన్వీనర్ కె.సోమునాయుడు డిమాండ్ చేశారు. బోనస్ చెల్లించడానికి కొన్ని కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. బోనస్‌లు ఉచితంగా ఇస్తున్నట్లు చెబుతున్నారని, బోనస్ అనేది కార్మికులకు బకాయి పడ్డ వేతనమని, యాజమాన్యాల ఇష్టాఇష్టాలను బట్టి చెల్లించేది కాదని స్పష్టం చేశారు. బోనస్ చెల్లించని పరిశ్రమల యాజమాన్యంపై పోరాటం చేసి కార్మికులకు న్యాయం చేయడం జరిగిందని తెలిపారు. లేబర్ అధికారులు జోక్యం చేసుకొని చట్టప్రకారం బోనస్ చెల్లింపు అమలయ్యేలా చూడాలని కోరారు.

గ్రామీణ వికాస్ బ్యాంకు భవనం మార్పు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెంలోని గ్రామీణ వికాస్ బ్యాంకును ఇప్పటి వరకు నిర్వహిస్తున్న భవనం నుండి నర్సీపట్నం రోడ్డులోని బోదుపువీధిలోకి మార్చినట్లు బ్రాంచ్ మేనేజర్ ఎం.మధుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు ఖాతదారులు దీనిని గమనించాలని కోరారు. కొత్త భవనం బ్యాంకు శాఖను ఎపిజిబి చైర్మన్ కె.ప్రమాద్ కుమార్‌రెడ్డి చేతులు మీదుగా బుధవారం ప్రారంభించడం జరుగుతుందుని పేర్కొన్నారు.

నేడు ఎంపిపిపై అవిశ్వాస నోటీసు

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి ఎంపిపి బోదెపు గోవిందరావుపై అవిశ్వాస నోటీసు ఈ నెల 24న బుధవారం నర్సీపట్నం ఆర్‌డిఒకు ఇవ్వనున్నట్లు రేగుపాలెం ఎంపిటిసి రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు ప్రజాశక్తికి ఫోన్‌లో తెలియజేశారు. ఊటీ క్యాంపులో ఉన్న తాము మంగళవారం బయలుదేరామని, బుధవారం నేరుగా నర్సీపట్నం చేరుకొని ఆర్డీఓను కలుస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీఓ యలమంచిలి మండల పరిషత్ బలపరీక్ష తేదీ నిర్ణయించే వరకూ తిరిగి అజ్ఞాతంలోకి వెళతామని, బలపరీక్ష రోజు హాజరై ఎంపిపి పదవిని కైవసం చేసుకుంటామని తెలిపారు. 2020 మార్చిలో తాను ఎంపిపి ఆశిస్తున్నట్లు చెప్పగానే తమ ఇరువురినీ తేల్చుకోమని వైసీపీ అధిష్టానం చెప్పినప్పుడు, గోవిందరావు పదవి కోసం తనను బతిమిలాడితే కండిషన్లతో ఒప్పుకున్నారని చెప్పారు. పార్టీ మారిన తర్వాత కూడా గతంలోని కండిషన్ల గురించి ప్రస్తావిస్తే ఆయన


అవిశ్వాస నోటీసు ఇవ్వనున్న ఎంపిటిసిలు వీరే..

స్పందించకపోవడంతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆశీస్సులతో అవిశ్వాస నోటీసుకు సిద్ధమయ్యామని తెలిపారు. ఓటు వేసే అర్హత ఉన్న ఆరుగురు ఎంపీటీసీల్లో తనతో పాటు వైస్ ఎంపిపి ఉమాగణేష్ (జంపపాలెం), నగిరెడ్డి అమ్మాజీ (ఏటికొప్పాక), బర్రె శివలక్ష్మి (కొత్తలి) మద్దతుతో యలమంచిలి ఎంపిపి పదవిని త్వరలోనే కైవసం చేసుకుంటామని సూర్యచంద్ర శేషగిరిరావు ధీమా వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న 'పాదుకా పట్టాభిషేకం'

ప్రజాశక్తి-అనకాపల్లి : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా గవరపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద జరుగుతున్న ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి పాదుకా పట్టాభిషేకం పద్యనాటికను ప్రదర్శించారు. ఖమ్మం జిల్లా సుమిత్ర యూత్ అసోసియేషన్ మధిర కళాకారులు ప్రదర్శించిన ఈ నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. కథా సారాంశం... శ్రీరామపట్టాభిషేక వార్త విన్న కైక మంథర దుర్బోధతో తోక తొక్కిన ఆడ త్రాచవుతుంది. శ్రీరామచంద్రుని అడవికి పంపించి భరతునికి ఆ పట్టాభిషేకం చేయాలని దశరధుడిని కోరుతుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని వాదిస్తుంది. అడవికి వెళ్లమని రాముడికి చెప్పలేక ఇచ్చిన మాట తప్ప లేక మూర్ఛ పోతాడు దశరథుడు. తండ్రి మనసు తెలుసుకున్న శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణులతో వనవాసానికి వెళతాడు. మేనమామల ఇంటి నుంచి వచ్చిన భరతుడు తండ్రి మరణ వార్త కంటే అన్న వనవాసానికి ఎక్కువగా బాధపడి అన్నని తీసుకొస్తానని అడవికి బయలుదేరుతాడు. నా వనవాసం, నీపట్టాభిషేకం తండ్రి ఆనతి అని భరతుడికి నచ్చ చెప్తాడు శ్రీరాముడు. నీ గుర్తుగా ఈ పాదుకలను స్పృశించి ఇస్తే నీబదులు నీ పాదుకలు రాజ్యం చేస్తాయని తన


నాటకంలోని ఓ సన్నివేశం

శిరస్సు సింహాసనం చేసి భరతుడు ఆ పాదుకులకు అక్కడే పట్టాభిషేకం చేయటంతో నాటకం ముగుస్తుంది. ఈ నాటకంలో డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వం వహించి దశరధుడు పాత్రధారించారు. శ్రీరాముడుగా చిలువేరు శాంతయ్య, దశరధుడుగా డాక్టర్ నిభాను పూడి సుబ్బరాజు, లక్ష్మణుడిగా కిషోర్, భరతుడుగా రమణ, సుమంతుడుగా సాంబశివ, వశిష్టుడుగా కోటి, కైకగా అమత వర్షిణి, సీతగా సురభి పూజిత నటించగా హార్మోనియం ఉయ్యూరు నాగేశ్వరరావు సహకారం అందించారు. రామాయణంలోని కొన్ని సంఘటనల ఇతివృత్తంగా సాగిన ఈ నాటకం ప్రేక్షకులను మెప్పించింది.

ఉపాధ్యాయ సమస్యలపై డిఇఒకు వినతి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఉపాధ్యాయ సమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడుకు ఎపిటిఎఫ్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షులు కేకేఎల్‌ఎన్.ధర్మారావు, ప్రధాన కార్యదర్శి సిరికి దుర్గాప్రసాదు మాట్లాడుతూ 10వ తరగతి ఇన్విజిలేషన్ డ్యూటీ, స్పాట్ వాల్యుయేషన్ చేసిన ఉపాధ్యాయులకు వెంటనే అలవెన్స్‌లు చెల్లించాలని కోరారు. డిప్యుటేషన్‌లపై వేర్వేరు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి పాఠశాలల్లో విద్యాబోధనకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చోడవరంలో భారీ వర్షం

- రోడ్లు, కాలనీలు జలమయం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బాలాజీ నగర్, రెల్లివీధి, బానయ్య కోనేరు, నౌడివీధి ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. డ్రైనేజీలో ఉన్న మురుగునీరు వర్షం నీటితో కలిసిపోవడంతో రోడ్లపై నడవడానికి ఇబ్బందులు పడ్డారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి నీరు నిల్వ ఉండి పోతుందని స్థానికులు అంటున్నారు.


కాలనీలో నీటి ప్రవాహం

బీమా ప్రీమియంపై జిఎస్‌టి ఉపసంహరణ గొప్ప విజయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణ ప్రజలకు పెద్ద ఉపశమనమని, ఏఐఐఈఏకి గొప్ప విజయమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ అధ్యక్షులు జేఎస్ శాస్త్రి అన్నారు. స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం వద్ద జిఎస్‌టి రద్దుపై మంగళవారం విజయోత్సవం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయం సమీకరణ ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై అమలులో ఉన్న 18శాతం జీఎస్టీని ఉపసంహరించుకుందని తెలిపారు. మొదట సర్వీస్ టాక్స్ అమలైనప్పటి నుంచి దీన్ని వ్యతిరేకిస్తూ 30 లక్షల పాలసీ హోల్డర్ల సంతకాలతో అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ నిరంతర పోరాటం ఫలితంగా అన్ని పార్టీల మద్దతు లభించి, చివరకు జీఎస్టీ కౌన్సిల్ ఈ అంశాన్ని చర్చించి ఉపసంహరణ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ప్రైవేటీకరణపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు.

త్రైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-యలమంచిలి : స్కూల్‌గమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీలకు యలమంచిలి నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిని కోచ్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో అభినందించారు. పరవాడ, గోపాలపట్నం ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ క్రీడలకు జరుగుతున్న ఎంపికల్లో అండర్-19 విభాగంలో నగిరెడ్డి మోమిత్, అండర్ 17 విభాగంలో ఎం.హర్షత, గాయత్రి బంగారు పతకాలు సాధించి ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెలలో కడప జిల్లాలో జరిగే ఫెడరేషన్ రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీల్లో ఈ ముగ్గురు పాల్గొంటారని చెప్పారు.

42 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని చెరుకు కాటా సమీపంలో ఒక ఆటోను తనిఖీ చేయగా, అందులో 42 కేజీల గంజాయి పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకొని కేరళ రాష్టం తామరక్కుడికి చెందిన సుందరేషన్ తంపి, అల్లూరి జిల్లా బందవీధికి చెందిన బోనంగి అర్జున్ ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తాచేరు కాజ్‌వే వద్ద విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట సమీపంలోని తాచేరు కాజ్‌వే వద్ద 8వ తరగతి విద్యార్థి మంగళవారం గల్లంతయ్యాడు. విజయరామరాజు పేట గ్రామానికి చెందిన ఆడారి రోహిత్ సరదాగా కాజ్వే వద్దకు వెళ్ళాడు. కాలి చెప్పు జారిపోవడంతో వాగులోకి దిగడంతో గల్లంతయ్యాడు. విద్యార్థి కోసం పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాలిస్తున్నారు. గాలింపు చర్యలకు వర్షం అంతరాయం కలిగించింది. 40 రోజుల క్రితమే భారీ వర్షాలకు ఈ కాజ్వే కొట్టుకుపోయింది. రానున్న కాలంలో ఈ వాగు ప్రవాహంలో ఎన్ని ప్రాణాలు బలి అవుతాయోనని స్థానికులు భయభ్రాంతులకు గురియవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వంతెన నిర్మాణం చేపట్టి ప్రజలు ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.


కూలిపోయిన తాచేరు వంతెన వద్ద గాలిస్తున్న సిబ్బంది

గోవాడ సుగర్స్ సమస్యపై అసెంబ్లీలో చర్చించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యపై అసెంబ్లీలో చర్చించి కర్మాగారం ఆధునికీకరణకు ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ ఈ ప్రాంతంలో అత్యంత కీలకమైన సుగర్ ఫ్యాక్టరీ సమస్యను చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించి, ఫ్యాక్టరీ బలోపేతానికి ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. రాష్ట్రంలో సహకార రంగంలో ఎంతో పేరుగాంచిన గోవాడ సుగర్స్ చరిత్ర కూటమి ప్రభుత్వ దయవల్ల ఈ ఏడాదితో ముగిసిపోయే స్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతుల నుంచి ఎటువంటి అగ్రిమెంట్ తీసుకోకపోవడం, యంత్రాల ఓవరాయిలింగ్ లాంటి పనులు చేపట్టకపోవడంపై సమాధానం చెప్పాల్సి వస్తుందని ఏకంగా మహాజన సభను కూడా నిర్వహించడం మానేశారని పేర్కొన్నారు. చెరకు రైతులకు, కార్మికులకు ఇవ్వాల్సిన రూ.30 కోట్లు బకాయిలు విషయాన్ని కూడా ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. తన పోరాటాలు వలనే సుగర్ ఫ్యాక్టరీ నడుస్తున్నట్లు చెప్పుకొచ్చిన జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు నేడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. ఇటువంటి నాయకులను నమ్ముకొని మూడు నియోజకవర్గాల రైతు మోసపోయారన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి గెలిచిన ఎంపి సిఎం.రమేష్, ఎమ్మెల్యేలు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలకు రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఫ్యాక్టరీ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య సేవలపై డిఎంహెచ్ఒ ఆరా

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మాకవరం గ్రామంలో అందుతున్న వైద్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి మంగళవారం సందర్శించి పలువురిని ఆరా తీశారు. ప్రధానంగా ఆసుపత్రి నుంచి గ్రామంలో అందుతున్న సేవలు, వయో వందన కార్డ్ క్రియేట్ ఎలా జరుగుతుందో ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఫ్రైడే డ్రైడే, మాత శిశు సంరక్షణ సేవలు, ఎస్ఎన్ఎస్‌పిఏ కార్యక్రమం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, పీహెచ్సీ వైద్యాధికారి వాణి జగదీశ్వరి, డిప్యూటీ హెచ్ఈఓ మంగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ సిబ్బందికి గౌరవ వేతనం పెంపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నడుస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన నక్కపల్లి, చోడవరం పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సీనియారిటీ ప్రాతిపదికన గౌరవ వేతనాల పెంపును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆమోదించారు. ఈ సందర్భంగా సిబ్బంది మంగళవారం జిల్లా ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ వేతనాల పెంపుతో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేసి, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, వెల్ఫేర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ బి.రామకృష్ణ, నక్కపల్లి బంక్ ఇంచార్జ్ ఏఆర్ఎస్ఐ వర్మతో బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులను ఎంపీడీవో శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఇంటి నుండి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని, తడి పొడి చెత్తలను వేరువేసి వర్మీ కంపోస్టు తయారు చేయాలని, దీన వల్ల పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని చెప్పారు. కార్యక్రమం సర్పంచ్ పెడిరెడ్ల మాణిక్యం, మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, ఈఓపిఆర్‌డి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, ముమ్మిన నాగరాజు, గాలి సూరిబాబు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ తదితరులు

చిల్లర వర్తకుల దుకాణాల తొలగింపు ఆపాలి



అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నేత శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో చిల్లర వర్తకుల దుకాణాలు, తోపుడు బండ్లు తొలగింపు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల శంకరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, మండల కన్వీనర్ కాళ్ల తెలయ్యబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి అధికారులకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో అనేక ఏళ్లుగా వీధి వ్యాపారులు, చిల్లర వర్తకులు, తోపుడుబళ్ల కార్మికులు రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారిపై మున్సిపల్ అధికారుల దౌర్జన్యంగా చిన్న చిన్న బడ్డీలను, రేకుల షెడ్లును, షాపులను ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. ఆక్రమణలు తొలగించాలి అనుకుంటే వీధి వ్యాపారులతో ముందస్తుగానే సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయం చూపించాల్సిన అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా షాపులను బుల్డోజర్లతో తొలగించి ఆర్థిక నష్టం చేయడం దారుణమన్నారు. ఆర్థికంగా నష్టం జరిగిన దానికి నష్టపరిహారం చెల్లించాలని, వీరందరికీ పట్టణంలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి ఉపాధిని పునరుద్ధరించాలని, ప్రభుత్వ బ్యాంకులు, డిఆర్‌డిఏ ద్వారా రుణ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.

పిడుగు పాటుకు పాడి గేదె మృతి



గేదె మృతదేహం వద్ద బాధిత రైతు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్‌పై అగ్రహారం గ్రామంలో పిడుగు పడి పాడి గేదె మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎంపీటీసీ యడ్ల పైడినాయుడు తమ గేదెను చెట్టు కింద కట్టి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం 1.30 సమయంలో ఉరుములు మెరుపులు కూడిన వర్షంతో గేదెను కట్టిన చింతచెట్టుపై పడింది. అది జారుకుంటూ వచ్చి కింద ఉన్న పాడి గేదెపై పడడంతో ఆ గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ పాడి గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుంది. పశు పోషణ చేసుకుంటూ జీవనాధారం సాగిస్తున్న ఆ కుటుంబం ఆకస్మాత్తుగా గేదె చనిపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. విపత్తు ద్వారా ఈ దుర్ఘటన జరిగింది కాబట్టి ప్రభుత్వం వెంటనే ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. పశు వైద్య నిపుణులు వీఆర్వో సమక్షంలో పంచనామా నిర్వహించారు.

రేషన్ కొరతపై తహశీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం గొర్లవానిపాలెం పంచాయితీ పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టిట్కో కాలనీలో లబ్ధిదారులకు సరిపడా రేషన్ సరఫరా కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, మండల అధ్యక్షురాలు మనియాల బంగారమ్మ, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి రేషన్ డిపో ఏర్పాటు చేయించుకున్నామని, అయితే ప్రస్తుతం వస్తున్న రేషన్ సరిపోవడం లేదని, లబ్ధిదారులకు సరిపడా రేషన్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దీనికి తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సరోజినీ, లక్ష్మమ్మ, వరలక్ష్మి, మంగమ్మ, కనకమహాలక్ష్మి, రమణమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో చెత్త బండి ఏర్పాటు చేయాలి

పరవాడ : స్థానిక టిడ్కో గృహ సముదాయంలోని 520 ఇళ్లకు చెత్త బండి ఏర్పాటు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం పరవాడ మండలం జనసేన ఇన్చార్జి పంచకర్ల ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, మండల అధ్యక్షులు మన్యాల బంగారమ్మ, కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ మాట్లాడారు. చెత్త బండి లేకపోవడంతో కాలనీలో ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. దీంతో దుర్వాసనతో పాటు మలేరియా, వైరల్ ఫీవర్లు వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీత, రాధ, అరుణ, కవిత పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డు పట్ల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-వడ్డాది : ఉమ్మడి విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంతంలో అత్యంత ప్రధానమైన బిఎన్ రోడ్డు నిర్మాణం విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న ఆరోపించారు. మంగళవారం వడ్డాదిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సుమారు 4జిల్లాలకు ప్రధాన రహదారి అయిన బిఎన్ రోడ్డు పట్ల కూటమి నేతలకు ఇంత నిర్లక్ష్యం తగదన్నారు. విజయరామరాజుపేట తాచేరు కాజ్వే కొట్టుకుపోయి 40 రోజులు కావస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. వడ్డాది-చోడవరం మధ్య రవాణా వ్యవస్థ స్తంభించిపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడం దారుణమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో వడ్డాది, విజయరామరాజుపేట వంతెనలు, బిఎన్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికిన ఎంపి సీఎం.రమేష్, చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు నేడు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేలు స్పందించి తాచేరు కాజ్‌వేను పునరుద్ధరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సీడాప్ లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సీడాప్ రూ.60 కోట్ల లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త కాంగ్రెస్ నేత వెంకటరమణ 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి, సీవీసీ, సీబీఐ, ఏసీబీలకు ఫిర్యాదు చేశారు. ఆ వివరాలను ఆయన మంగళవారం ఒక ప్రకటన ద్వారా మీడియాకు విడుదల చేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు ప్రధాన కేంద్రంగా ఉన్న రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి (సీడాప్) అవినీతి, నిధుల దుర్వినియోగం, లోపభూయిష్ట పరిపాలన ఆరోపణలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. యువతకు శిక్షణ, ఉపాధి కల్పించాలన్న లక్ష్యాలకు సీడాప్ తూట్లు పొడిచిందని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



పెట్రోల్ బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి-కోటవురట్ల : నిబంధనలో పాటించకపోతే చర్యలు తప్పవని తహశీల్దారు తిరుమలబాబు అన్నారు. మండలంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాములను సిఎస్ డిటి ఈశ్వరరావుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో పాటు ప్రజలకు అందించాల్సిన కనీస నిబంధనల పట్ల నిర్లక్ష్యం చేయరాదని సూచించారు, అర్హులందరికీ ఉచిత గ్యాస్ పథకాన్ని అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో రోగాల నివారణ

ప్రజాశక్తి-సబ్బవరం : ఆయుర్వేదంతో సర్వరోగాలు నివారణ చేయవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్ అన్నారు. కళాశాలలో మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వైద్య విధానమైన ఆయుర్వేదం దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, అధ్యాపకులు రజని, డాక్టర్ గణేష్ లెక్కల తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో మంగళవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు మెడిసినల్ ప్లాంట్స్‌పై స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు లావణ్య వివరించారు. తులసి, తిప్పతీగ, వేప, అలివేరా, వావిలి వంటి మొక్కల ప్రాముఖ్యతను, వాటిని తీసుకోవడం ద్వారా కలిగే ఉపయోగాలు వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు సిహెచ్ గణేష్, యోగ శిక్షకులు చంద్రిక, అప్పారావు, సిబ్బంది, ఆర్ఏఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి ఫణీంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక కోడిగంటి గోవిందరావు భవనంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించడం జరిగిందని, కానీ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, జిల్లా ఉపాధ్యక్షులు సింహాద్రి, అభిషేక్, అజయ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

చూచుకొండ పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని చూచుకొండ పిఎసిఎస్‌లో మంగళవారం మహాజనసభ జరిగింది. ముందుగా సీఈవో ఆడారి వెంకటస్వామి నాయుడు వార్షిక నివేదిక, బడ్జెట్‌ను సభలో ప్రవేశ పెట్టారు. సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం పిఎసిఎస్ అధ్యక్షులు పెంటకోట నరసింగరావు మాట్లాడుతూ రైతుల డిపాజిట్లపై వడ్డీ రేటును 7.5 శాతం నుండి 8 శాతం చేయనున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంఘం నికర లాభం రూ.5,47,087 సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పెంటకోట రఘురాం, కర్రి వెంకు నాయుడు, పాల సంఘం అధ్యక్షులు కాంగ్రెస్ నాయుడు, కూటమి నాయకులు వీర రాజశేఖర్, కాళ్ల చంద్రమోహన్, కాంగ్రెస్ శంకర్ పాల్గొన్నారు.

బీమాకు పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-యలమంచిలి : ప్రకృతి వైపరీత్యాల మూలంగా నష్ట జరిగే పంటలకు ఇన్సూరెన్స్ వర్తించాలంటే ప్రతి రైతూ తను వేసిన పంటను వ్యవసాయశాఖ ల్యాండ్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జాహ్నవి అన్నారు. మండలంలోని తెరువుపల్లి, పురుషోత్తపురం, రుక్మిణీపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అక్టోబరు మొదటి వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహనరావు, విస్తరణాధికారి నారాయణరావు, రెవెన్యూ అధికారి పార్వతమ్మ, రైతులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల వితరణ



లైబ్రేరియన్‌కు పుస్తకాలను అందజేస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు లక్నో డిజిపి కిల్లాడ సత్యనారాయణ పంపించిన పుస్తకాలను మంగళవారం స్థానిక టౌన్ ఎస్ఐ జి. ఉమామహేశ్వరరావు గ్రంథాలయాధికారిణి పి. దమయంతికి అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ తాము అడిగిన వెంటనే సహాయం అందిస్తున్న డిజిపి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. బుచెంపేట ప్రభుత్వ పాఠశాల సోషల్ అసిస్టెంట్ రాము మాట్లాడుతూ తాను ఈ గ్రంథాలయంలోనే చదివి ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడ్డానన్నారు. టౌన్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి సహాయం కావాలన్నా అందిస్తానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి. ప్రభాకర్, సాంబశివ పాల్గొన్నారు.

వుషు, బాక్సింగ్ క్రీడాకారులకు ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో విజయ్

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లే వుషు, బాక్సింగ్ విభాగాల క్రీడాకారులకు నేషనల్ ట్రయల్స్ దృష్ట్యా ఎన్టీఆర్ స్టేడియంలో 10 రోజులపాటు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉషు కోచ్ ప్రియాంక ఆధ్వర్యంలో సీనియర్ కోచ్ ఎర్ర శేఖర్ సమన్వయంతో నిర్వహించే శిబిరంలో పాల్గొనే 15 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ నింజాస్ అకాడమీ డైరెక్టర్లు భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు. వీరంతా మంగళవారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్‌ను కలిసి, ఇండోర్ వసతి, క్రీడా పరికరాల కొరత, ముఖ్యంగా మహిళా క్రీడాకారులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి వీలైనంత త్వరలో స్థలం చూసి సమస్య పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

ఉచిత వ్యాక్సినేషన్ పరిశీలన



సూచనలు చేస్తున్న వెటర్నరీ ఏడి చిట్టినాయుడు

ప్రజాశక్తి -చీడికాడ :మండలంలోని అర్జునగిరి గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధికి ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా వెటర్నరీ ఏడి డాక్టర్ వి. చిట్టినాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాడి రైతులందరూ వ్యాక్సినేషన్ వినియోగించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సోకిక పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని, ప్రాణప్రమాదం కూడా ఉందన్నారు. ఇప్పటివరకు చీడికాడ మండలంలో 4265 పశువులకు, మాడుగులలో 3615 పశువులకు వ్యాక్సినేషన్ చేసినట్లు తెలిపారు. అనంతరం పెదగోగాడ పశు వైద్య శాలను సందర్శించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సంతోష్, వెటర్నరీ అసిస్టెంట్ గంగు నాయుడు పాల్గొన్నారు.

దళితుల దీక్ష భగ్నం దుర్మార్గం



దళితులతో మాట్లాడుతున్న పోలీసులు



అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : పంట పొలాలను నాశనం చేస్తున్న రాతి క్వారీల అనుమతులు రద్దు చేయాలని రెండు నెలలకు పైగా దీక్షలు చేస్తుంటే, ఆ సమస్యను పరిష్కరించకుండా దౌర్జన్యంగా దళితుల దీక్షలు భగ్నం చేయడం దుర్మార్గమని మాకవరపాలెం మండల జి.కోడూరు దళిత రైతులు మంగళవారం ఆందోళన చేశారు. 63 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న దళిత రైతులను అవమాన పరుస్తూ ఈడ్చుకుంటూ తీసుకెళ్లి, అమానుషంగా పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై మండిపడ్డారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తులపై విడిచిపెట్టారు.దీనిపై బిఎస్‌పి నేత నాగరాజు మాట్లాడుతూ దళిత రైతులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం ఇలా దౌర్జన్యం చేయడం తగదన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



రైతులకు డ్రమ్ములు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్ర అన్నారు. మండలంలోని జానకయ్యపేటలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రకృతి విధానంలో సాగుతో తక్కువ పెట్టుబడులతో ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. వరి, జీడి, మామిడి, కొబ్బరి వంటి తోట పంటలలో ప్రకృతి విధానాలను పాటించడంపై శాస్త్రవేత్తలు వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేసే రైతులకు జీవామృతం, నీమాస్త్రం తయారీకి ప్రోత్సాహకంగా డ్రమ్ములు, క్యాన్లు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ ఏడి కె. ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, ఈ క్రాప్ బుకింగ్, సమతుల యూరియా, నానో యూరియా వాడకంపై వివరించారు.

కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవి, కెవికె సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, గ్రామ పెద్దలు కురందాసు సింహాచలం, ఎఇలు సత్యనారాయణ, సాయికుమారి, విఎఎలు కొండలరావు, సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పారావు, తాసుబాబు, మంగ, మహిళా రైతులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న సూర్యచంద్ర

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు నూరుశాతం గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, బిసి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం గొలుగొండలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్న సారథ్యంలో అన్ని గ్రామాలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేయాలని, విపక్షాల విమర్శలు బలంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, గండెం దొరబాబు, అల్లాడ సురేష్, సలాదుల ప్రసాద్ బాబు, బోయిన చిరంజీవి, సత్తిరెడ్డి మణిబాబు, బాబురావు, అబ్బానాయుడు, మరాశా స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



చెత్త సేకరణపై పరిశీలిస్తున్న ఎంపిడిఒ సీతారామరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలో జానకయ్యపేట, సిహెచ్ లక్ష్మీపురం గ్రామాల్లో పారిశుధ్య పనులను మంగళవారం ఎంపిడిఒ సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు మంగళవారం పరిశీలించారు. ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని పర్యవేక్షించారు. చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

యస్ రాయవరం : మండలంలో జెవి పాలెం గ్రామంలో స్వామిత్వ సర్వే తీరును ఎంపిడిఒ మీనకుమారి పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు సర్వే చేయాలని ఆదేశించారు.అనంతరం దార్లపూడి, భీమవరం, ధర్మవరం అగ్రహారం పంచాయతీలలో డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణతో కలిసి పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు చేశారు.

వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం



ఉత్సవ కావిడి సేవలో తిరువీధిలో అర్చకులు

ప్రజాశక్తి- నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం నుంచి వచ్చేనెల2 వరకు పది రోజులపాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకలకు ప్రారంభ సూచికగా ఆలయ ప్రధానఅర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, సంఘర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవ కావిడితో తిరువీధి సేవ నిర్వహించారు.

భక్తులు స్వామికి పసుపు, కుంకుమ, కొబ్బరి బొండాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు స్వామి ఉత్సవమూర్తులతో తిరువీధి సేవలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో పందిళ్లు, విద్యుద్దీకరణ, ఇతర అలంకరణలు చేపట్టారు.

భోజన, వసతి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లుపై చర్చిస్తున్న డిఇఒ అప్పారావు నాయుడు

ప్రజాశక్తి -నక్కపల్లి : మెగా డిఎస్‌సిలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతిలో ఈనెల 25న నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి వారి కుటుంబ సభ్యులతో విశాఖపట్నం నుండి వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లను డిఇఒ అప్పారావు నాయుడు పర్యవేక్షించారు. విశాఖ వైపు నుంచి అమరావతి వెళు తున్న సుమారు రెండు వేలమందికి నక్కపల్లిలోనిస్థానిక గురుకుల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం భోజనం ఏర్పాట్లు చేయనున్నారు. మంగళవారం ఆయా ఏర్పాట్లను పరిశీలించిన డిఇఒ, ఎంఇఒ శ్రీనివాసరావు, స్థానిక హెచ్‌ఎంలకు తగు సూచనలు చేశారు.

రామకృష్ణను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్త యల్లవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు అల్లు రామకృష్ణను నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర గణేష్ మంగళవారం పరామర్శించారు. కొన్ని రోజులు క్రితం వైజాగ్‌లో చదువుతున్న అల్లు రామకృష్ణ కుమారుడు రామచరణ్ కాలేజ్ నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోవడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గిరిబాబు, మండల అధ్యక్షుడు కొరుప్రోలు ఫణి శాంతారాం, లెక్కల సత్యనారాయణ, మాకిరెడ్డి రామకృష్ణ, నాయుడు నల్లబెల్లి శ్రీను, అల్లు రాజుబాబు, యాళ్ల నాయుడు, జోగా రామకృష్ణ,కొల్లు అప్పలనాయుడు ఉన్నారు.

హైడ్రో ఒప్పందాలు అల్లూరి స్ఫూర్తికి విరుద్ధం


అల్లూరి, గంటం దొర సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న అప్పలనర్స, తదితరులు

- ప్రాజెక్టులు తక్షణం రద్దు చేయాల్సిందే
- ఆదివాసీ అరణ్య గర్జన యాత్రలో

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- గొలుగొండ : అల్లూరి జిల్లాఏజెన్సీ ప్రాంతంలో ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం ఆదివాసీల జీవన విధానం, సాంస్కృతిక గుర్తింపు, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పల నర్స విమర్శించారు. కెడి.పేట అల్లూరి పార్కు వద్ద ముందుగా అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర సమాధులకు నివాళిర్పించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం రద్దుకు అల్లూరి స్ఫూర్తితో పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

అనంతరం జిల్లా కార్యదర్శి పి. అప్పల నర్స మాట్లాడుతూ, ఈనెల 22న సీలేరులో ప్రారంభించిన అరణ్య గర్జన జీపు యాత్ర 27న మజ్జివలసలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఆదివాసీల హక్కులను ఉల్లంఘిస్తూ, పర్యావరణాన్ని నాశనం చేస్తూ, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వాలు చేసుకున్న హైడ్రో వపర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాల్సిందేని స్పష్టం చేశారు. ఆదివాసీల హక్కులకు, వారి భూములు, సంస్కృతికి కాపాడటానికి బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామ రాజు అని, ఇపుడు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అల్లూరి స్ఫూర్తికి విరుద్ధంగా, ఆదివాసీల భూముల ను నవయుగ, మెగా, షిరిడీ సాయి, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం ద్వారా మన్యవాసుల జీవనోపాధిని ధ్వంసం చేయాలని చూస్తున్నారని, ఇది అల్లూరి పోరాట స్ఫూర్తిని అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎర్రవరం,పెదకోట తదితర ఐదు చోట్ల ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు పదివేల ఎకరాల భూసేకరణ చేయాలని చూస్తున్నారని, దీనివల్ల వేలాది ఆదివాసీ కుటుంబాలు తమ ఆవాసాలు, జీవనోపాధులను కోల్పోయి, అడవులకు దూరమయ్యే పరిస్థితి దుస్థితి నెలకొంటుందని వాపోయారు. పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, చేపల వేటపై ఆధారపడే ఆదివాసీల జీవనం హైడ్రో ప్రాజెక్టులతో అతలాకుతల మౌతుందని, ప్రాజెక్ట్ వల్ల సహజ వనరులన్నీ నాశనమై, దూరమై, ఆదివాసీలు ఆవాసాన్ని, ఆదాయాన్ని, ఆహార భద్రతను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల నిర్మూలన, నదీ ప్రవాహంలో మార్పులు, జీవవైవిధ్య నష్టం వల్ల పర్యావరణ వ్యవస్థలు ధ్వంసమై, మన్యంలోని అరుదైన జంతు, వృక్ష జాతులను అంతరించే ప్రమాదం ఉందని అప్పలనర్స ఆవేదన వెలిబుచ్చారు. ప్రాజెక్టులతో ఆదివాసీల పవిత్ర స్థలాలు, సాంప్రదాయ జ్ఞానం, సామాజిక ఐక్యత దెబ్బతింటాయని, వారి సాంస్కృతిక గుర్తింపును కోల్పోయేలా చేస్తుందన్నారు.

అటవీ హక్కుల చట్టం గ్రామసభల అనుమతి లేకుండా భూసేకరణ చట్టాలకు విరుద్ధంగా, మన్యవాసుల మనోభిప్రా యాలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా సాగుతున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులు, ఒప్పందాలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు జీపుయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొర్ర త్రినాధ్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.బుజ్జిబాబు, నాయకులు కొర్ర బాలయ్య, వరహాలు, సింహాద్రి, బాబూరావు, జీకే వీధి మండల కార్యదర్శి వి బుజ్జిబాబు, కె.బాలయ్య పాల్గొన్నారు.



ఆదివాసీ అరణ్యగర్జన జీపుయాత్రలో మాట్లాడుతున్న అప్పలనర్స

వితంతు పింఛను దరఖాస్తులపై విచారణ

ప్రజాశక్తి -నక్కపల్లి: వితంతు పెన్షన్ మంజూరు చేయాలని పిజిఆర్ఎస్ దరఖాస్తులపై మంగళవారం మండలంలో గొడిచెర్ల గ్రామంలో ఎంపిడిఒ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు విచారణ చేపట్టారు. గ్రామానికి వెళ్లి పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదార మహిళల నుండి వివరాలు సేకరించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయుల సేవలకు ప్రశంసలు



ప్రశంసాపత్రాలు, సత్కారం అందుకుంటున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -కొత్తకోట: వికలాంగ విద్యార్థుల అభ్యున్నతికి విశేషకృషి చేస్తున్న మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు బి.మహాలక్ష్మి నాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు జి. జగన్నాథ నాయుడు జాతీయ మేధో వైకల్య వికలాంగుల సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు ఎయు ఇంజినీరింగ్ కాలేజీ అంబేద్కర్ ఆడిటోరియంలో ఎయు విద్యావిభాగం సంయుక్త ఆధ్వర్యాన జాతీయ మేధో వైకల్య వికలాంగుల సాధికారిత సంస్థ నిర్వహించిన వికలాంగ విద్యార్థుల 'పర్పుల్ ఫెయిర్' కార్యక్రమంలో వీరిని సత్కరించి, వికలాంగ బాలలకు వారు చేసిన సేవలను కొనియాడారు. వికలాంగ బాలలకు ఉపకరణాల పంపిణీ, వారికి సదరం శిబిరాల్లో ధ్రువీకరణలు పొందేలా సహకారం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సౌకర్యాలను వికలాంగులు అందిపుచ్చుకునేలా తోడ్పాటు నందిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వినీత్ సింఘాల్, ఎయు రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, సికింద్రాబాద్‌కు చెందిన సంస్థ డైరెక్టర్ డాక్టర్ బివి. రామ్‌కుమార్, ఎయు తెలుగు విభాగాధిపతి ఆచార్య టి. షారోన్ రాజు, విశాఖపట్నం సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త జె. చంద్రశేఖరరావు, జాతీయ మేధో వైకల్య సాధికారత సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కూన లలిత, ఆడిప్ స్కీమ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపుపై నిరసనలు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు. కార్మికులు

ప్రజాశక్తి-అనకాపల్లి ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేసే కార్మికుల పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో టిడిపి, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ కేంద్రం బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు షాపులు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు రోజుకు 13 గంటలు పనిని పెంచడం, మహిళలకు రాత్రి షిఫ్ట్ డ్యూటీలు వేయవచ్చని అసెంబ్లీలో తీర్మానం చేయడమంటే కార్మిక వర్గ శ్రమనే దోచుకోవడమేనని పేర్కొన్నారు. విరామంతో కలిపి ఫ్యాక్టరీలలో రోజుకు ఉన్న 9 గంటల పనిని 10 గంటలకు, 5 గంటల పని తర్వాత విశ్రాంతి ఉన్న నిబంధనను 6 గంటలకు ప్రత్యేక సందర్భాల్లో విశ్రాంతి, విరామాలతో కలిపి 10.30 ఉన్న దాన్ని 12గంటలకు మార్చిందని తెలిపారు. సంస్థల్లో 8 నుండి 10కు పెంచిందని, మహిళలను రాత్రిపూట కూడా పని చేయడాన్ని అనుమతించిందని పేర్కొన్నారు. ఈ మార్పులను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పరిశ్రమల్లో పని గంటలు పెంచడం వలన కొత్తగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండదని, ఉన్న కార్మికులతోనే శ్రమదోపిడీ చేస్తారని, నిరుద్యోగం తీవ్రంగా పెరుగుతుందని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక బీజేపీ, టిడిపి, జనసేన ప్రభుత్వాల విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, జి.వరలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు కె.తేలయ్య బాబు, పి.చలపతి, ఎస్‌కెబిబి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : వేతనాలు పెంచమంటే పని గంటలు పెంచడం దుర్మార్గమని కార్మికులు ధ్వజమెత్తారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ మినీ స్టేడియం వద్ద గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్, డైలీ వేజ్, వివిధ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్లు, ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్, హోటల్స్‌లో లక్షలాది మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన పనిభారం, ఒత్తిడితో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి కార్మిక చట్టాలు, హక్కులు అమలు చేయాల్సిన పాలకులు పని గంటలు పెంచే నిర్ణయం చేయడం దారుణమన్నారు. పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి డి.మహాలక్ష్మి, ఆశా మండల నాయకులు అరుణ, ముఠా నాయకుడు కే సాంబ, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఐద్వా జిల్లాకోశాధికారి కెవి.సూర్యప్రభ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

ఫ్లైయాష్ ఇబ్బందులపై ఎన్‌టిపిసికి ఎమ్మెల్యే లేఖ

ప్రజాశక్తి-పరవాడ : ఫ్లైయాష్ రవాణా కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఎన్టీపీసీ సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు మంగళవారం లేఖ రాశారు. మండలంలోని కొన్ని గ్రామాల సందర్శన సమయంలో ఫ్లైయాష్ రవాణా కోసం వెళ్తున్న బరువైన వాహనాలు సంపూర్ణంగా కప్పకుండా ప్రయాణిస్తున్నాయని, ఈ కారణంగా స్థానిక ప్రజలకు, పర్యావరణానికి తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. రహదారులపై మెత్తబడిన ఫ్లైయాష్ వల్ల గాలిలో దుమ్ము, కాలుష్యం పెరగడం, అత్యధిక బరువు వాహనాల వల్ల రహదారులు చెత్తగా మారడం, పంటలకు, చెట్లకు, మానవ ఆరోగ్యానికి నష్టం కలిగించడం జరుగుతుందని తెలిపారు. ఫ్లైయాష్ వాహనాలకు టార్పలిన్లు, లేదా ఇతర కవర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, రహదారులను పట్టించుకోవాలని, జనసంబంధిత భద్రతా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటానికి, కంపెనీ చట్టబద్ధ బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.